సంగోజీపేట్‌లో కుస్తీ పోటీలు

సంగోజీపేట్‌లో కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 13 : మండలంలోని సంగోజీపేట్ గ్రామంలో శనివారం గ్రామపెద్దల ఆధ్వర్యంలో కుస్తీపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో తలపడేందుకు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి మల్లయోధులు తరలివచ్చారు. పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. పోటీలను తిలకించేందుకు హన్మాజీపేట్, సంగోజీపేట్, కాద్లాపూర్, సోమ్లానాయక్‌తండా, గోపాల్‌తండా, వెంకటాపూర్ తండాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. గ్రామపెద్దలు సాయిలు, శంకర్ గౌడ్, నాగభూషణం, రాజు, బాల్‌రాజు, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుబుక్కుల పంపిణీ

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 13: మండలంలోని సముందర్‌తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పోస్టుమాస్టర్ పండరి నోటు బుక్కులను పంపిణీ చేశారు. డాక్టర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని పోస్టుమాస్టర్ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు షేక్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం..

- విద్యుత్ వైర్లపై వేలాడుతున్న రెగ్జిన్ కవర్
- నెల రోజులుగా పట్టించుకోని విద్యుత్ సిబ్బంది

విద్యుత్ వైర్లపై వేలాడుతున్న రెగ్జిన్ కవర్

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 13 : మండలంలోని బోర్లం క్యాంపు నుంచి బోర్లం వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ వైర్లపై నెల రోజులుగా పెద్ద రెగ్జిన్ కవర్ వేలాడుతున్నది. నిత్యం ఈ రోడ్డు గుండా విద్యుత్ అధికారులు, సిబ్బంది వెళ్తున్నా.. అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో గ్రామస్తులు, రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు ఆందోళనకు గురువుతున్నారు. కవర్ తొలించే విషయమై విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఈ రోడ్డు గుండా పెద్దపెద్ద వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని విద్యుత్ వైర్లపై ప్రమాదకరంగా వేలాడుతున్న కవర్‌ను తొలించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తడిసిన పంట.. అన్నదాత ఆందోళన

సోమేశ్వర్‌లో ఆరబెట్టిన ధాన్యంలో నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతు

మద్నూర్/ పిట్లం/ బాన్సువాడ రూరల్/ బాన్సువాడ/డోంగ్లీ/బిచ్కుంద, ఏప్రిల్ 13: జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం వర్షం కురిసింది. దీంతో కోసి ఆరబెట్టిన పంట తడిసిపోయింది. ధాన్యంపై రైతులు టార్పాలిన్లు కప్పారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. పిట్లం మండలంలో శనివారం ఉదయం నుంచి చిన్నపాటి చినుకులు కురుస్తున్నాయి. దీంతో చేతికి వచ్చిన వరి, మక్క జొన్న పంట తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చిరుజల్లులు కురియడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటికి రాలేదు. మద్నూర్ మండలంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 11గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురియడంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. రోడ్లు జలమయమయ్యాయి. మురికి నీరు రోడ్లపై ప్రవహించింది. భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. బాన్సువాడ మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన ఆకాల వర్షంతో రైతులు ఆరబెట్టిన వరి ధాన్యం తడిసింది. వరి పంటలు చేతికి రావడంతో పంటలు కోస్తున్న రైతులు, ధాన్యాన్ని కల్లాలు, ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు వర్షం కురియడంతో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోవడంతో రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. ప్రభుత్వ సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం కూడా తమకు నష్టం కలిగిచిందని రైతులు వాపోయారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. పలు గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ, బీర్కూర్, కోటగిరి, వర్ని, నస్రుల్లాబాద్ మండలాల్లో వర్షం కురిసింది. ధాన్యం కుప్పలపై కప్పిన పట్టాలు గాలికి ఎగిరిపోవడంతో వర్షపు నీరు చేరింది.

మొలకలు వస్తున్నాయి..

ధాన్యంపై ఎన్ని టార్పాలిన్ కవర్లు కప్పినా గాలి దుమారానికి ఎగిరిపోతున్నాయి. భారీ వర్షానికి కుప్ప కింద నుంచి నీళ్లు పారి మొలకలు వస్తున్నాయి. సగం పంట కోత కోయలేదు. గాలి దుమారానికి సగం పంట రాలిపోయింది. ధాన్యం రాశిలోకి నీళ్లొచ్చి తడిసిపోయాయి.

- శివాజీ, మాదన్‌హిప్పర్గా, డోంగ్లీ

మద్నూర్‌లో రోడ్డుపై నిలిచిన నీరు

పిట్లంలో కురుస్తున్న వాన

తడిసిన ధాన్యాన్ని కొనాలి..

వరి కోతలు దాదాపుగా పూర్తయ్యాయి. ప్రభుత్వం ఈ నెల 1 నుంచి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ మా దగ్గర మాత్రం అధికారులు కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను పెంచి తడిసిన ధాన్యాన్ని కొనాలి.

- హండె సంజు, రైతు, హస్గుల్

వడ్ల కుప్పలు దెబ్బ తిన్నాయి..

పంట కోసి నాలుగు రోజులవుతుంది. అకాల వర్షంతో వడ్ల కుప్పలు దెబ్బతిన్నయి. ఎకరానికి రూ.25వేలు పెట్టి 15ఎకరాలు కౌలు చేసిన. అకాల వర్షంతో భారీగా నష్టపోయా. ప్రభుత్వం మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు పెట్టింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు వేగంగా చేపట్టి.. తడిసిన ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తూ కొనాలి.

- షేక్ హుస్సేన్, కౌలు రైతు, హస్గుల్

ఆహ్వాన పత్రిక అందజేత

మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గౌడ్ సంఘం ప్రతినిధులు

బీబీపేట్, ఏప్రిల్ 13 : మండలంలోని మాందాపూర్ గ్రామంలో ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు రావాలని రైతు బంధు సమితి మాజీ మండల కన్వీనర్ నాగరాజ్‌గౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్‌కు ఆహ్వాన పత్రికను శనివారం అందజేశారు. ఈ నెల 21, 22, 23, 24వ తేదీల్లో నిర్వహించే ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, ఎంపీపీ బాలమణి, గౌడ సంఘం ప్రతినిధులు వెంకట స్వామి, నర్సాగౌడ్, రామా గౌడ్, సతీశ్, బాలరాజు, పరశురాములు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు వేతనం పెంచాలి

కామారెడ్డి, ఏప్రిల్ 13 : రాష్ట్రంలోని బీడీ కంపెనీల్లో పనిచేస్తున్న ఏడు లక్షల మంది కార్మికుల వేతన ఒప్పందం ముగిసిందని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ శివ్వంది సత్యం తెలిపారు. బీడీలు చుట్టే కార్మికులకు వెయ్యి బీడీల తయారీకి ప్రస్తుత వేతనాన్ని నాలుగుశాతం పెంచాలని కోరారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నెలవారి ఉద్యోగులకు రూ. మూడువేలు పెంచాలని కోరారు. బీడీ కంపెనీల్లో పని చేసే కార్మికులకు ప్రస్తుత వేతనంపై 40 శాతం పెంచి ఇవ్వాలన్నారు. బీడీ కార్మిక సంఘ నాయకులు హాసన్, సిద్ధిరాములు, రాజేందర్ పాల్గొన్నారు.

లచ్చాపేటలో బడిబాట

మాచారెడ్డి, ఏప్రిల్ 13 : మండలంలోని లచ్చాపేట గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతుల గురించి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాజేశ్వర్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

భిక్కనూరు, ఏప్రిల్ 13 : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నామని ఎస్సై సాయికుమార్ తెలిపా రు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుబ్బా క మండలం పోతారం గ్రామానికి చెందిన యాడారం రాజశేఖర్ పెద్దమల్లారెడ్డి నుంచి కంచర్ల గ్రామం వైపు టాటా ఏస్ వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. 30 సంచుల బియ్యాన్ని (15.3 క్వింటాళ్లు) పట్టుకొని, డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్యకు సమాచారం అందించామన్నారు. కేసు నమోదు చేసుకొని జంగంపల్లి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు చెప్పారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినా, రవాణా చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

- బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి

మాట్లాడుతున్న బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 13 : రైతులకు ఇబ్బందులు కలుగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. బాన్సువాడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, సీనియర్ నాయకుడు ఎజాస్‌తో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ప్రగల్భాలు పలికిందని, ఒక్కసారి కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి చూడాలని సూచించారు. ఒకపక్క అకాల వర్షాలు కురుస్తున్నాయని, సరిపడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపై ఉన్న ధాన్యం తడిసిపోయిందన్నారు. ధాన్యాన్ని ఎండబెడుతూ రైతులు అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్కన కాంటాలు అయిపోయి రైతుల ఖాతాల్లోకి డబ్బులు రావడం లేదని తెలిపారు.

రైతులకు ఇబ్బంది కలుగకుండా గత ప్రభుత్వం రా రైస్ మిల్లులకు కూడా అలాట్‌మెంట్ ఇచ్చిందని గుర్తుచేశారు. నిజామాబాద్ జిల్లా పరిధిలోని రా రైస్ మిల్లులకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం కామారెడ్డి జిల్లాలో ఎందుకు ఇవ్వలేదు అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఈ విషయంపై కమిషనర్‌కు తెలియజేసినా వారు స్పందించడం లేదని తెలిపారు. రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు.

అత్యవసర వైద్యం.. అందని వైనం

- డోంగ్లీ ఆరోగ్య కేంద్రంలో అరకొర వైద్య సేవలు
- 24గంటలు సిబ్బంది అందుబాటులో లేక ఇబ్బంది
- ఎమర్జెన్సీలో ఇతర దవాఖానలకు పరుగులు

డోంగ్లీ, ఏప్రిల్ 13: అత్యవసర వైద్య సేవలు మండల ప్రజలకు అందని ద్రాక్షలా మారుతున్నాయి. డోంగ్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలను అందించాల్సి ఉన్నది. కానీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మాత్రమే సిబ్బంది విధులను నిర్వహిసున్నారు. దీంతో రోగులకు అత్యవసర పరిస్థితిల్లో ఇబ్బందులు తప్పడం లేదు.

విధులు నిర్వహించే సిబ్బంది తక్కువే..

డోంగ్లీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొత్తం 20 మంది వైద్య సిబ్బంది ఉన్నారు. వీరిలో ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్సు, ఇద్దరు ఫార్మాసిస్ట్‌లతో పాటు మిగిలిన వారు ఏఎన్ఎంలు ఉన్నారు. కానీ నిత్యం అందుబాటులో నలుగురు మాత్రమే ఉంటున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రతి రోజూ 60 నుంచి 70 మంది రోగులు వైద్య సేవల కోసం వస్తున్నారు. వారికి సరైన వైద్య సేవలు అందడం లేదని వాపోతున్నారు. ఏదైనా పెద్ద సమస్య వస్తే ప్రైవేటు దవాఖానలకు పరుగెత్తాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రాత్రి వేళలో ప్రమాదం జరిగినా.. గర్భిణులకు ఇబ్బంది ఎదురైనా మహారాష్ట్ర, బాన్సువాడ తదితర ప్రాంతాలకు సుమారు 20 నుంచి 30 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని అంటున్నారు. ఒక్కో సమయంలో రోగి పరిస్థితి విషమిస్తున్నదని పేర్కొన్నారు. 15 మంది ఏఎన్ఎంలు ఉన్నా.. వారిని సబ్‌సెంటర్లకు పంపించడంతో దవాఖానలో డాక్టర్, ఫార్మాసిస్ట్, నర్సు, డీఈవో మాత్రమే ఉదయం నుంచి సాయంత్రం అందుబాటులో ఉంటున్నారు.

108 అంబులెన్స్ సేవలూ కరువే..

మండలానికి 108 అంబులెన్స్ వాహనాన్ని కేటాయించలేదు. ఆపద సమయంలో అంబులెన్స్ కోసం ఫోన్ చేస్తే అది బాన్సువాడ నుంచి వస్తుందని, అప్పటి వరకు రోగి తీవ్ర అవస్థ పడుతున్నడని ప్రజలు వాపోతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరిగినా, గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చినా పరిస్థితి ఆందోళనకరంగా మారుతుందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పిట్లం బస్టాండ్‌కు మరమ్మతులు

పిట్లంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు మరమ్మతు పనులు చేపడుతుండడంతో చెట్టు కింద బస్సు కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

పిట్లం, ఏప్రిల్ 13: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు. బస్టాండ్ పైకప్పు కూల్చివేయడంతో ప్రయాణికులకు నిలువ నీడ లేకుండా పోయింది. వేసవి కాలం కావడంతో ప్రయాణికులు బస్టాండ్ ఆవరణలో ఉన్న చెట్ల కింద నిలబడుతున్నారు. తాత్కాలికంగా కనీసం టెంట్ కూడా ఏర్పాటు చేయలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి తగిన సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

కష్టపడి పనిచేసే వారికే పార్టీ పదవులు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 13: లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడి పనిచేసే వారికే పార్టీ పదవులు దక్కుతాయని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిలోని క్యాంప్ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేండ్లలో ఎంపీ బీబీ పాటిల్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగికి ఆక్సిజన్ సిలిండర్ అందజేత

రామారెడ్డి, ఏప్రిల్ 13: మండలంలోని పోసానిపేట్ గ్రామానికి చెందిన సాయిలు తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నది. ఆమెకు ఆక్సిజన్ సిలిండర్ అవసరం అని వైద్యులు తెలిపారు. దీంతో నారెడ్డి ట్రస్టు వ్యవస్థాపకుడు నారెడ్డి మోహన్‌రెడ్డి బాధితురాలికి ఆక్సిజన్ సిలిండర్‌ను అందజేశారు. దీంతో సాయిలు కుటుంబ సభ్యులు ట్రస్టు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED TEACHERS

★**WANTED TEACHERS** to teach all subjects from Nursery to X Std E/M Pri-primary 8,000/- to 12,000/- Primary 10,000/- to 14,000/- Upper Primary 11,000/- to 18,000/- High School 15,000/- to 28,000/- Principal 25,000/- 35,000/- Cont:**Liberty High School,** old NGO Colony, Nizamabad, Cell:7993552268
NTZ-324542

WANTED

★**హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను,** పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

WANTED

★**KFC Hiring P/F Time Jobs** in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ జితేశ్ వీ పాటిల్
- అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి/బాన్సువాడ టౌన్/ మద్నూర్, ఏప్రిల్ 13 : అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో కామారెడ్డి విపత్తు స్పందన, అగ్ని మాపక సేవల శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలు, గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలన్నారు. గోదాములు, షాపింగ్ మాల్స్‌లో ప్రమాదాలు జరగకుండా యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు.

కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి సయ్యద్ మహ్మద్ అలీ, లీడింగ్ ఫైర్‌మెన్లు రవీందర్ రెడ్డి, లక్ష్మణ్, ఆపరేటర్లు సాయిబాబా, నరేందర్ రావు, ఫైర్ మెన్లు స్టాలిన్, శ్రావణ్, రమేశ్, జలంధర్, వెంకటి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడలో అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించి న కరపత్రాలను డీఎస్పీ సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఇన్‌చార్జి రాజిరెడ్డి, రవీందర్‌గౌడ్, లింగం, హరిసింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్నూర్‌లోని తహసీల్ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను తహసీల్దార్ ముజీబ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి వినోద్‌కుమార్, ఫైర్ సిబ్బంది రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

మిర్జాపూర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 13 : బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లోని దుర్కి, మిర్జాపూర్, దామరంచ గ్రామాల్లోని ప్రాథమిక సహకార సంఘం పరిధిలో తడిసిన ధాన్యాన్ని శనివారం అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లో తడిసిన 2,500 బస్తాల గురించి రైస్ మిల్లర్లతో మాట్లాడారు. తడిసిన బస్తాలను రైస్ మిల్లులకు పంపేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చివరి గింజ వరకు ధాన్నాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఆయన వెంట ప్రాథమిక సహకార సంఘాల సిబ్బంది, రైతులు ఉన్నారు.

రైతులు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 13: అకాల వర్షానికి ధాన్యం తడిసిందని రైతులు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. ప్రతి గింజనూ సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ఎల్లారెడ్డి, గండిమాసానిపేట్ గ్రామాల్లోని సొసైటీల వద్ద తడిచిన ధాన్యాన్ని శనివారం పలువురు సొసైటీ పాలకవర్గ సభ్యులు, నాయకులు పరిశీలించారు. వర్షం కురిసే అవకాశాలు ఉన్నందున ధాన్యంపై టార్పాలిన్లు కప్పుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో విశ్వనాథం, సొసైటీ వైస్ ప్రసిడెంట్ ప్రశాంత్‌గౌడ్, డైరెక్టర్లు, రైతులు సుఖేందర్ రెడ్డి, తిరుపతి, సాయిరాంగౌడ్, కుర్మ సాయిబాబా, నాగం గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

బీబీపేట్, ఏప్రిల్ 13 : మండల కేంద్రానికి వచ్చిన ఓ వ్యక్తి మొబైల్ ఫోన్ పోయింది. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీస్‌లు సీఈఐఆర్ యాప్ ద్వారా పోగొట్టుకున్న సెల్ ఫోన్ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎస్సై ప్రభాకర్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ మల్లేశం బాధితుడికి పోలీస్‌స్టేషన్‌లో ఫోన్ అందజేశారు.

డ్రైనేజీ తీశారు.. చెత్త ఎత్తడం మరిచారు

వర్షం కురియడంతో డ్రైనేజీలోకి చేరుతున్న చెత్త

పిట్లం, ఏప్రిల్ 13: మండలకేంద్రంలోని హరిజనవాడ కాలనీలో మురికి కాలువలను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. కానీ చెత్తను ఎత్తివేయడం మరిచిపోయారు. శనివారం ఉదయం కురిసిన వర్షానికి చెత్త మళ్లీ మురికి కాలువల్లోకి చేరుతున్నదని కాలనీవాసులు అంటున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి మురికి కుప్పలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.